# శివాలయానికి

మందారం నారికేళంతో గుమ్మంలో అడుగు పెట్టాడు.

'కొబ్బెరకాయ తెచ్చావా? మందారం!' అడిగింది వదిన, కూతురికి జడవేస్తూ మందహాసం చేసింది.

'తెచ్చా వదినా!' కొబ్బెరకాయని వంగి వదినె ప్రక్కనే పెట్టేశాడు.

"ఏమైనా మిగిలిందా మందారం! మిగిల్తే దార్లో ఓ యిన్ని పచ్చిమిరపకాయలు తేలేక పోయావా?"

'మిగిల్తే కదా?'

'ఇచ్చిన అయిదణాలూ అయిపోయాయి? అధమం ఒక్కణా అయినా మిగుల్తుందనుకున్నా'

'అణా తగిలింది' అన్నాడు మందారం.

'సత్యన్నారాయణ దగ్గరేనా కొన్నావు? వాడెంతో మంచివాడని, నా పేరుచెబితే తక్కువ ధరల కిస్తూంటాడని మీ అన్నయ్య ఎన్ని ప్రగల్భాలు కొట్టారనుకున్నావ్ మందారం! అయితే, మీ అన్నయ్య కబుర్లన్నీ నీళ్లమూటలే నన్నమాట!. ఇంతకీ మీ అన్నయ్య పేరు చెప్పగానే తగిలిందా అణా?'

'చెప్పాను వదినా!'

'ఏమిటి చెప్పావో ఎలా చెప్పావో కాస్త చెప్పు?' విందామని కుతూహలపడ్డది వదినగారు.

'వెళ్ళగానే అందరికీ మల్లేనే నాకూ కాయఖరీదు ఆరణాలు చెప్పాడు. చెబితే, నేను శ్రీమన్నారాయణగారి తమ్ముణ్ణనీ, మా అన్నయ్య మీతో

చెప్పమన్నాడనీ చెప్పా వదినా!.....'

'కానైతే?' మధ్య నడిగింది వదినగారు.

'నువ్వు శ్రీమన్నారాయణగారి తమ్ముడివైతే నాకేం? సీతామ్మవారి సోదరుడివైతే నాకేం? మీ అన్నయ్య పెద్ద గవర్నరా యేమిటి? అతనూ నాలాంటి వ్యాపారస్తుడే! నన్నంటే మీ అన్నయ్య ధర తగ్గించి యిమ్మన్నాడుకాని, మీ అన్నయ్య బట్టలమీద ఓ అణా తగ్గిస్తాడూ? అని కసిరాడు వదినా!'

"ఆరి వీడిపోత్రం మండిపోనూ! యింత కబుర్ల పోగయ్యాడూ? సరేలే! నీ అణా నువ్వు తీసుకో మందారం!" అంది వదిన.

"అక్కర్లేదు వదినా! నీ దగ్గరే వుంచు" మందారం సిగ్గుపడ్డాడు.

"తీసుకో మందారం! నీకు మాత్రం ఎలా వస్తుంది? ఎప్పుడో ఫస్టుతారీఖున మీ నాన్నగారు జీతానికి పంపితేనే నీ కుంటుంది. అందులో మిగిలితేనే. తీసుకోవయ్యా! పుచ్చుకుంటే వదినె మీద అభిమానం లేదనుకోరెవ్వరూ" అని ఆగి, లేచి వెళ్ళి అణాకాసుని మందారం జేబులో కూరింది.

మందారం సిగ్గుతో బుర్రదించుకుని వెళ్ళిపోయాడు.

శ్రీమన్నారాయణ గుమ్మంలో అడుగుపెడుతూ కొబ్బరికాయని చూసి 'ఎక్కడిదేవ్! ప్రియురాలా!' అని జిజ్ఞాసతో అడిగాడు.

'మందారం తెచ్చిపెట్టాడు' వెంటనే సమాధానం ముట్టింది.

'కొనేనా?'

'అబ్బే! లేదుత్తినే!... మహా ఒక్కణాయినా తగ్గించలేని వెధవ ఉత్తినే యివ్వడం కూడానా?' మూతిముడిచింది, వెక్కిరింపుగా మందాకిని.

'ఎవరు తగ్గించలేదు? ఎవరిదగ్గరో కొంటే ఏం తగ్గిస్తారు? వాళ్ళేం అంతా మన తాతగారి చుట్టాలా?' మీసం త్రిప్పాడు శ్రీమన్నారాయణ.

'అబ్బే! లేదు. మీ తాతగారి చుట్టందగ్గర కొన్నదే! ఓ అణా ఎక్కువకూడా గుంజుకున్నాడు ముండాచుట్టం!' ఎగతాళిగా అంది మందాకిని.

'సత్యనారాయణ దగ్గిరేనా? అణా ఎక్కువ కూడా గుంజుకున్నాడా? ఇంత దగుల్బాజీ అయిపోయాడా? నేన్నమ్మను!.. అసలు నువ్వు నా పేరు చెప్పావురా మందారం?' తమ్ముడివంక తిరిగాడు శ్రీమన్నారాయణ.

'చెప్పా నన్నయ్యా!'

'చెప్పకేం? అక్షరం అక్షరం విడమర్చి మరీ చెప్పాడు.' మందాకిని అంది.

'అయినా తగ్గించలేదా?'

"తమపేరు కంత పలుకుబడి వుందని రుజువైంది" సున్నితంగా అభినయిస్తూ వెక్కిరించింది.

అది శ్రీమన్నారాయణకి చెంపదెబ్బ. మళ్లీ సర్దుకుని. "ఇంతకీ కాయ దేనికో చెప్పావుకావు" అన్నాడు.

"పరమేశ్వరుడి కని వేరే చెప్పాలా?' అంది మందాకిని.

'అబ్బో! మహా గొప్పభక్తి లావై పోయినట్టుందే! చాలు పోనిద్దూ! కాయకొట్టు తిందాం!"

'తినేందుకు మీకు దవడలు గట్టివేగాని ఆగండి. అత్తగారు దేవుడికి మొక్కించారు. దేవాలయానికెళ్లి కొట్టి రావాలి!'

'నాదగ్గరల్లాంటి చచ్చుకబుర్లు చెప్పకు. దేవుడూ గీవుడూ జాంతానయ్! ముందు కాయముక్కలు చెయ్!' దబాయించాడు శ్రీమన్నారాయణ.

'ఒద్దండోయ్! సరసం కట్టిపెట్టండి. దేవుడికోసమంటే లాక్కోబోతారేం? అత్తగారికి తెలిస్తే కోప్పడతారు.' మందాకిని కాయచేత్తో నొక్కిపట్టుకుంది.

'ఆ విషయం తరువాతాలోచిద్దాం! మా అమ్మ ఎలాగూ ఊళ్లో లేదుకదా! ఉంటేమాత్రం శ్రీమన్నారాయణంతటి ముద్దులకొడుకు తింటానన్నాడంటే ఒద్దంటుందా ఏమిటి?'

'అబ్బే! ఒద్దంటూరా! మీ ముద్దు ముక్కలు చేస్తారు." వంకర మూతి పెట్టింది మందాకిని.

'అంతకుముందే కాయ చెక్కలు చెయ్!'

'మింగేద్దురుగాని!... మందారం! రా! కాయ కొట్టవోయ్ మీ అన్నయ్య గారు తింటారు. అబ్బ! ఆశ లావూ పీక సన్న మూను!' గేలిచేసింది మందాకిని.

'ఏం వొదినా పిల్చావు?'

"ఎందుకా? ఈ టెంకాయ చూశావా! దీన్ని వెంటనే కొట్టి నోట్లోకూరేయ్! మీ అన్నయ్య తింటారుట. కొట్టునాయనా కొట్టు! దేవుడుకోసం దేవుడా అంటే వింటారూ!.. వెళ్లమందారం వెళ్లి చదువుకో! ఈయన కబుర్లతో మనకేమిటీ?"

"వెళ్ళకురా మందారం! దీని డాబేమిటో నేనూ చూస్తాను. పచ్చికాయలాక్కుని పగలకొట్టరా! ముందు అప్పుడే దేవుడొస్తాడో చూద్దాంగా!" శఠం మాత్రం వదిలాడుకాడు శ్రీమన్నారాయణ.

స్త్రీ సహజమైన స్నిగ్ధమనస్తత్వం మందారం చేతికి మందాకిని ద్వారా కాయనిప్పించింది.

"కొట్టరా చూస్తావేం?"

మందారం కాయతో కుస్తీపట్టాడు. ఒలిచి బ్రద్దలు చేశాడు. శ్రీమన్నారాయణ నోట్లో చెరకు గానుగ తిరిగింది.

"కాయ కుళ్ళిందన్నయ్యా!"

✿ ✿ ✿

"కాయ కుళ్లిందన్నయ్యా"

"ఆ కుళ్ళిందా? ఇంతమంచి కాయిచ్చాడూ సత్యన్నారాయణ? భటాచోర్! ఇచ్చిన ఆరణాలూ పుచ్చేసుకున్నాడేమిట్రా?"

"మరో అర్ధణా ఎక్కువకూడానూ!"

"హారి వీడి తస్సాదియ్యా! సత్యన్నారాయణ యింత దోపిడీ దొంగైపోయాడూ? అయితే ఆ అర్ధణా యిచ్చావా?"

"లేదు. తర్వాత మా అన్నయ్య తీసుకొచ్చి యిస్తాడని చెప్పి పట్టుకొచ్చాను."

"ఆఁ యిస్తాను వీడికి రమ్మనీ! వెళ్ళు వెళ్ళి ఈ కుళ్ళిందాన్ని వాణ్ణెత్తిన కొట్టి మరోటిమ్మను. ఈ సారైనా మంచి దివ్వకపోతే ఆపై అర్ధణా యివ్వనన్నాని చెప్పు!" శ్రీమన్నారాయణ గద్దించాడు.

మందారం అన్నగారు ఆజ్ఞను శిరసావహించి, వినూత్న నారికేళంతో భ్రాత ముందు హాజయ్యాడు. అనుకున్నంత పనీ చెయ్యలేదు సత్యనారాయణ. కాస్త పెద్దమనిషే!

"పచ్చడి చేసుకునేందుకే నేమిటి మందారం!" అంటూ వచ్చింది మందాకిని. టెంకాయని మెచ్చుకుంది.

"ఆఁ.. తిందువుగాని పచ్చడి! తినడానికి నీనాలికైతే సున్నితమైందేగానీ తగ్గు!" శ్రీమన్నారాయణ పెరట్లో స్నానం చేస్తూ అరిచాడు.

"కూరకా?" అప్యాయంగా అడిగింది భర్తని.

"అలాగే కూరొండు కుందాం! చెక్కులు చెయ్యరా! మందారం! మీ ఒదిన కూరొండుతుంది. నువ్వూ నేనూ తిందాం! ఊరుకోవే ఒయ్యారిభామా! దేవుడికోసం తెస్తే కూరా వండేస్తావ్, పచ్చడీ రుబ్బేస్తావ్! వెళ్ళు వెళ్ళు. పోయి పని చేసుకో!"

"ఓహో! దొరగారికి దేవుడిమీద అమాంతం భక్తి కుదిరేసినట్టుందే! ఇదేమిటండోయ్ ఈ వింత! నిజంగా దేవుడికోసమేనా!" విస్తుబోయింది మందాకిని భర్త మానసిక పరిణామాన్ని విని.

"కాకపోతే మరేమి టనుకున్నావ్! దేవుణ్ణి నమ్మకపోతే మనం బ్రతగ్గలమా!"

"ఎందుకూ! వద్దు! నమ్మకండి. దేవుడూ లేడూ, గీవుడూ లేడూ, నేను పచ్చడి చేసేస్తాను. అందరమూ కలిసీ తినేద్దాం!"

"తినేయడం దేవుడుగుళ్లోం చొచ్చాక ఆలోచిద్దాంలే!"

"మీరు వెళ్తారా యేమిటి! అయ్యయ్యో! కోవెలకే! నే వెళ్లితే కూడదూ? ఏం కట్టుబాటండీ! ఇక నుండీ నేనూ వెళ్తుంటా తప్పకుండా!"

"అవశ్యం-వెళ్లు! అయ్యో నిన్నెవడొద్దన్నాడు? ఎవడొద్దనగలడసలు? వెళ్ళుపిల్లా నువ్వెళ్ళి వచ్చాకనే నేనూ వెళ్తా ఆ కర్పూరం, పూదొత్తులూ ఇలా అందుకోరా మందారం! ఈలోగా"

మందాకిని ప్రొద్దున్న భర్తకి తెలియకుండా తెప్పించిన కొబ్బరికాయని పట్టుకుని వెళ్లబోయింది.

"ఇలా చూడు ప్రియురాలా! వెళ్లి దేవుణ్ణి ఏమని ప్రార్థిస్తావ్!"

"నాకు తోచినట్టు"

"నీకు తోచినట్టయితే ఎలా పనికొస్తుందీ! నే చెప్పినట్లు చెయ్యాలి.. ఇలా ప్రార్థించు! ఓ యీశ్వరుడా! మా ఆయన కెప్పుడూ ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించూ! బట్టల వ్యాపారంలో బాగా లాభాలు వచ్చేటట్లనుగ్రహించూ! బేడీలు పడకుండా కాపాడు!" అని శ్రీమన్నారాయణ భగవన్నామ ప్రార్థన ధోరణిలో చెప్పాడు.

"చాల్లెండి, అన్నీ మీ మేలుకోసమే ప్రార్థిస్తే, నా మేలుకోసం నేనేం ప్రార్థించేదీ?"

"అదీ చెప్తావిను!... గరళకంఠా! నా శీలం చెడకుండా కాపాడు తండ్రీ! ఎల్లప్పుడూ భర్త పాదదాసీనై, పతివ్రతగా వుండేటట్లనుగ్రహించు! మా ఆయనవంటి మంచికొడుకే పుట్టేటట్టు వరం దయచెయ్యి మహానుభావా! బోధపడ్డాదా?"

"అలాగేనండి. వెళ్తున్నా"నని బయల్దేర బోయింది మందాకిని. శ్రీమన్నారాయణ మళ్లీ ఆపి "ఇదిగో మందాకినీ! కోవెల్లో జాగ్రత్తగా మసలాలిస్మా!" అన్నాడు.

"అంటే?...."

"అంటేనా? కోవెల్లో ఆడవాళ్ళు నిల్చున్న వైపే నిల్చోడం, ఆడవాళ్ళు వెళ్తున్నవైపే వెళ్తాండం, ఆడవాళ్ళమధ్యనే నిల్చోడం చెయ్యాలి. పురుషుల్తో ఏ విషయంలోనూ జోక్యం కలగజేసుకో కూడదుస్మా! దుర్మార్గులుంటారని తెలుసుకో!" హెచ్చరించాడు శ్రీమన్నారాయణ.

ప్రతిరోజూ శ్రీమన్నారాయణ శివాలయానికి వెళుతున్నాడు. భార్యనీ పంపుతున్నాడు. పంపకపోతే భార్య తన మేలుకోసం భగవంతుణ్ని ప్రార్థించవద్దూ!

శ్రీమన్నారాయణ నల్ల మార్కెట్లో బాగానే సంపాదిస్తున్నాడు. అందుకేగా! గరళకంఠునిమీద అంతభక్తి!

* * *

శ్రీమన్నారాయణ షాపులో కూర్చున్నాడు. రెండు చేతులా డబ్బు ఆర్జిస్తూ లెక్ఖ పెడుతున్నాడు. ఆదివారం కావడం వలన సంత హడావుడి జాస్తీగా వుంది. శ్రీమన్నారాయణ పల్లెటూరివాళ్లకి బాగా టోపీ వేస్తున్నాడు.

'మీ కోసం ఎవరో ఒచ్చారు బాబూ!' అన్నాడు నౌఖరీ కుర్రాడు.

'ఎవరు? ఇప్పుడు దేవుణ్ణి చూడ్డానికికూడా వీల్లేని స్థితిలో వున్నానని చెప్పు!' అన్నాడు శ్రీమన్నారాయణ సగర్వంగా- విసుగ్గా!

'మిమ్మల్నిప్పుడే చూడాలన్నారండీ!'

'ఎవరోయ్ వీళ్లు! పెద్ద దేవుడికే దిక్కులేదు- రమ్మను!' ఎట్టకేలకు అనుజ్ఞ యిచ్చాడు.

కొంతమంది మనుషులు నిమిషంలో లోనికి వచ్చారు. శ్రీమన్నారాయణ గతుక్కుమన్నాడు.

ఎవరు వాళ్లు?

శ్రీకృష్ణ జన్మస్థానానికి తీసికెళ్ళడానికి వచ్చిన యమభటుల్లాంటి పోలీసులు! వారంటు చూపారు. వణిజాని గుండెలు గుభేలు మన్నాయ్. శ్రీమన్నారాయణ వాళ్ళకి లంచం మేపడానికి ప్రయత్నించాడు. ఫలితం లేకపోయింది.

• ఆంధ్రప్రభ వీక్లీ ప్రారంభసంచిక •

*13–8–1952*